www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 1 అక్టోబర్ 2023
5
అన్నమయ్య

ప్రజా సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

పాదయాత్రలో మాట్లాడుతున్న మహేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర చేస్తున్నామని జనసేన పార్టీ దక్షిణ రాయలకోస్తా సంయుక్త పార్లమెంటరీ సమన్వయ కర్త మైఫోర్స్ మహేష్ అన్నారు. శనివారం పట్టణంలోని అమ్మచెరువుమిట్టలో పార్టీ నాయకులు గోపాలకృష్ణ, రమణ ఆద్వర్యంలో ఇంటింటా తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రజలు నాయకుల తీసుకువచ్చారు. ప్రతి సమస్య రాసుకుని సంబందిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషిచేస్తామని హామి ఇచ్చారు. అవినీతి, అక్రమాలు లేని ఏకైక నాయకుడు, తన సొంత సంపాదనలో పేదలకు సాయం అందించే ఏకైక వ్యక్తి పవన్ కళ్యాణ్ మాత్రమేనన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో జనసేన పార్టీకి ఓటు వేసి గెలిపించాలని తద్వారా సుపరిపాలన సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శంకర్, జనసేన పార్టీ వీర మహిళలు శోభ, సునీత, పెద్ద సంఖ్యలో స్దానిక యువకులు పాల్గొన్నారు.

తగ్గిన పసుపు సాగు

పెరిగిన పెట్టుబడి - మద్దతు ధరలు నిల్

సీతారామపురం వద్ద సాగులో ఉన్న పసుపు పంట

ప్రజాశక్తి -చాపాడు

దేశంలోని ముఖ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల్లో పసుపు ఒకటి. దేశీయ వినియోగంతో పాటు కొన్ని వేల టన్నులను విదేశాలకు ప్రతి సంవత్సరమూ ఎగుమతి చేయడంతో పాటు, మందుల తయారీలో, రంగులలో, సౌందర్య సాధనాలలో, అధికంగా ఉపయోగిస్తారు. భారతీయ సంస్కృతిలో పసుపునకు మంచి స్థానం ఉంది. ప్రతి కార్యక్రమంలో పసుపును తప్పక వాడతారు. పసుపు సాగులో భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. పసుపు ఉత్పత్తిలో 80 శాతం వరకు మన దేశానిదే. దేశీయ ఉత్పత్తిలో 40 శాతం వాటా మన ఆంధ్రప్రదేశ్‌ది. మన రాష్ట్రంలో గతంలో సుమారు 16 800 హెక్టార్లలో పసుపు సాగు చేస్తూ 146000 మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించేవారు. అది కూడా కడప, గుంటూరు జిల్లాలో ముఖ్యంగా పసుపు సాగు సాగు చేసేవారు.

గతంలో ఉమ్మడి కడప జిల్లాలోని 21 మండలాల్లో 12500 ఎకరాల్లో రైతులు సాగు చేసేవారు. రెండేళ్ల కిందట ఉమ్మడి కడప జిల్లాలో మండలాల వారీగా హెక్టర్‌లలో పసుపు సాగును పరిశీలిస్తే మైదుకూరులో 670, దువ్వూరులో 490, చాపాడులో 283, ఖాజీపేటలో 520, బి. మఠంలో 78, సికె దిన్నెలో 413, పెండ్లిమర్రిలో 62 , మైలవరంలో 175, జమ్మల మడుగులో 90, కాశీనాయన లో 370, పోరుమామిళ్లలో 235, కలసపాడు లో 75, ఒంటి మిట్టలో 210, సిద్ధవటం లో 330, నందలూరులో 156, చిట్వేలు 52, పుల్లం పేటలో 88, ఓబులవారిపల్లిలో 19, రాజంపేటలో 142, రైల్వేకోడూరులో 85, రాజుపాలెంలో 40 హెక్టార్లు సాగు అయ్యేది. ప్రతి ఏడాది సాగు ఖర్చులు పెరగడం, దిగుబడి తగ్గడంతో జిల్లాలో ఏటా వందల ఎకరాలు పసుపు సాగు తగ్గుతూ వస్తుంది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 3500 ఎకరాల్లో మాత్రమే పసుపు పంట సాగు అయినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలంలో సాగుకు రైతులు అనాశక్తి చూపు తున్నారు. ఈ ఏడాది మార్కెట్‌లో వ్యాపారులు ప్రారంభంలో రూ.4500 కొను గోలు చేసి, రైతులు పసుపు దిగుబడిని పూర్తిగా అమ్ముకున్న తరువాత ధరలు అమాంతం పెంచారు. ఇలాంటి పరిస్థితుల్లో పసుపు పంట సాగు చేసే నష్టాల్లో కూరుకుపోవడంతో ఎందుకని రైతన్నలు ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.

నిలకడగా లేని ధరలు...

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సిఎసిపి వారు పసుపు పంటకు కనీస మద్దతు ధర, గిట్టుబాటు ధర నిర్ణయించడం లేదు. జిల్లాలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ లో పసుపు పంటకు మార్కెట్ సౌకర్యం ఉంది. .మన రాష్ట్రంలో మన జిల్లాతో పాటు దుగ్గిరాల మార్కెట్ యార్డులో అమ్మకాలు జరుపుతారు .ధరల నిర్ణయం పూర్తిగా వ్యాపారస్తులదే. పసుపు గ్రేడింగ్ అధికారులు మాత్రం నామమాత్రంగా అందుబాటులో ఉంటున్నారు. సరైన గిట్టుబాటు ధరలు వచ్చేంతవరకు నిల్వ ఉంచుకునేందుకు నిల్వ సౌకర్యం అందుబాటులో లేదు. గత ఏడాది సాగైన పంటకు ప్రభుత్వం క్వింటాకు రూ. 6750 గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వ ఆధ్వర్యంలో పసుపు పంటను కొనుగోలు చేశారు. అయితే ప్రభుత్వం పసుపు సేకరించిన తరువాత మార్కెట్‌లో క్వింటా రూ. 10వేలకు పైగా పలికింది.

ప్రతి ఏడాదీ తగ్గుతున్న పసుపు సాగు..

దువ్వూరు మండలంలో పసుపు పంట సాగును గమనిస్తే 2018 -2019లో 2500 ఎకరాలు మండలంలో పసుపు పంట సాగు చేయగా ,2019- 2020లో 1800 ఎకరాలు సాగు చేశారు. 2020-2021లో 900 ఎకరాలు, 2021 -22 లో 550 ఎకరాలు, ప్రస్తుతం 290 ఎకరాలలో మాత్రమే పసుపు పంట సాగు చేశారు. జిల్లెల్ల, కానగూడూరు ,పెద్ద జొన్న వరం, రామ సాయి నగర్, గుడిపాడు, భీమునిపాడు, రామాపురం, వెంకుపల్లి, సి. ఎస్ పల్లి, మది రేపల్లె, సంజీవ రెడ్డి పల్లి ప్రతి సంవత్సరం పసుపు పంట తగ్గుతూ వస్తుందని ఉద్యానశాఖ అధికారులు తెలుపుతున్నారు. చాపాడు మండల పరిధిలోనూ పసుపు సాగు గణనీయంగా తగ్గుముఖం పట్టింది. గత ఏడాది 195 మంది సాగు చేపట్టగా ఈ ఏడాది వంద మందికి పరిమితమైంది. పసుపు పంట దిగుబడి తగ్గుతుండటం, గిట్టుబాటు ధర లేకపోవడం, 10నెలల పాటు పంటకు సంరక్షణ చేయాల్సి ఉండటంతో నష్టాలు వస్తున్నాయని అందువల్లే వేరే పంటలపై మొగ్గుచూపుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. పండిన పంటకు మద్దతు ధర ప్రకటించలేదని, ప్రభుత్వం కొనుగోలు పూర్తి చేయటం లేదని , ధరలు నిలకడగా ఉండటం లేదని రైతులు ఆందోళన చెందు తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మద్దతు ధర రూ.9 వేల నుంచి రూ.10 వేల కేటాయించాల్సిందిగా పసుపు పండించే రైతులు కోరుకుంటున్నారు.

సాగు ఖర్చులు అధికమవుతున్నాయి..



పసుపు పంట సాగుకు ఎకరాకు రూ. 80 నుంచి రూ. లక్ష వరకు ఖర్చు అవుతున్నాయి .దిగుబడి మాత్రం 30 నుంచి 35 క్వింటాళ్ళు మాత్రమే వస్తుంది. ప్రస్తుతం ఉన్న ధరలకు సాగు ఖర్చులు కూడా రావడం లేదు. రూ.10,000 వరకు పసుపు పంటకు ధరలు ఉంటే ఖర్చులు పోను కాస్త మిగులుతుంది .ప్రభుత్వం పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.

- రామసుబ్బారెడ్డి, రైతు, సీతారామపురం.

ధరలు లేక సాగు తగ్గించాం..

గతంలో నాలుగు నుంచి ఐదు ఎకరాలలో పసుపు పంటను సాగు చేపడుతూ ప్రస్తుతం తగ్గించాం. ప్రతి ఏడాది గిట్టుబాటు ధర లేక నష్టాలు మిగులుతున్నాయి. దీంతో పసుపు పంట సాగుకు ఆసక్తి తగ్గింది. పసుపు పంట ఏడాదిపాటు సంరక్షించు కోవాల్సిన అవసరం ఉంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇతర పంటలపై ఆధార పడుతున్నాం.

-మనోహర్‌రెడ్డి, చాపాడు.

పేదలందరికీ మెరుగైన వైద్యం : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రామాపురం

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పేదలకు మెరుగైన వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తోందని కలెక్టర్ గిరీష అన్నారు. శనివారం మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును జిల్లా కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూరాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సిబ్బంది ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఇంటి గడప వద్దనే ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఇక్కడ వైద్యం పొందుతున్న ప్రతి ఒక్కరి పేరు రిజిస్టర్ చేయించి వారి వ్యాధి నయం అయ్యే వరకు వైద్యులు మానిటర్ చేస్తారన్నారు. పేదలు ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బు మొత్తం జబ్బులకు ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రతి పేదవాడికి ఉచితంగా వైద్యం అందించి ఆదుకోవాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ఈ హెల్త్ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని మెరుగైన వైద్య సేవలు పొంది ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిరంతరం పేదల కోసం శ్రమిస్తూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలనే తపనతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం లాంటిదన్నారు. ప్రతి మనిషికి జీవితంలో ఆరోగ్యం ఎంతో ముఖ్యమని ప్రజలు ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించగలరన్నారు. నేడు ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అన్ని రకాల జబ్బులకు మెరుగైన వైద్యం అందించి ఉచితంగా మందులు ఇస్తామన్నారు. గతంలో దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి గుండె జబ్బులతో బాధపడుతున్న ఎంతోమంది పేదల జీవితాలలో వెలుగులు నింపారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసి అన్ని వ్యాధులకు ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. పేదలు గతంలో వైద్యం పొందాలంటే ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి నానా ఇబ్బందులు పడే వారన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రతి ఇంటికి వైద్యులు వెళ్లి రోగుల జబ్బు నయం చేసే విధంగా ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఒక్క పైసా ఖర్చు లేకుండా అన్ని వ్యాధులకు ఈ క్యాంపుల ద్వారా ఉచిత వైద్యం పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య ఎంపిపి విజయలక్ష్మి మాజీ ఎంపిపి జనార్దన్‌రెడ్డి, జడ్‌పిటిసి రమణ, ఎంపిటిసి నాగభూషణమ్మ వెంకటసుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ నాగభూషణ్ రెడ్డి, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భవ్యశ్రీ హంతకులను కఠినంగా శిక్షించాలి

మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు ధరణ్‌కుమార్

ప్రజాశక్తి-పీలేరు

భవ్యశ్రీ హంతకులను అరెస్టు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని మాల మహానాడు నాయకులు తెలిపారు. శనివారం మాల మహానాడు కార్యాలయంలో మాల మహనాడు రాయలసీమ జిల్లాల సహాయ కార్యదర్శి నగరిమడుగు సుభాష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం వేణుగోపాల పురానికి చెందిన యువతిని హత్య చేసిన హంతకులను అరెస్టు చేయడంలో అక్కడి పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. సెప్టెంబర్ 17న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన భవ్యశ్రీపై ముగ్గురు అగంతకులు అత్యంత దారుణంగా లైంగిక దాడికి పాల్పడి, ఆ బాలిక కనుగుడ్లు పెరికేసి, జుట్టు కత్తిరించి అత్యంత పైశాచికంగా హత్య చేసి, బావిలో పడేసిన సంఘటన జరిగి 13 రోజులు అవుతున్నా, పోలీసులు ఇంతవరకు నిందితులను గుర్తించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ హత్యను 2019లో జరిగిన దిశ హత్య కంటే భయంకరమైందని తెలియజేశారు. దిశ సంఘటనతో దిశ చట్టం రూపొందింది, దిశ పోలీస్ స్టేషన్‌లు వచ్చాయన్నారు. భవ్యశ్రీ హత్య కేసులో ఇంతవరకు ఏవిధమైన పురోగతి లేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవతో దిశకు పూర్తిగా న్యాయం జరిగింది, అనుమానితులను ఎన్‌కౌంటర్ చేసి దిశ ఆత్మకు శాంతి జరిగింది. నేడు కూడా ఇదే ప్రభుత్వం ఉంది దుస్సంఘటన తీవ్రత దిశ కంటే దారుణంగా ఉంది ప్రభుత్వం వెంటనే స్పందించి హత్యకు గురైన భవ్యశ్రీ కుటుంబాన్ని ఆదుకుని, హంతకులను వెంటనే అరెస్టు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దిశ ఆధిపత్య కులానికి చెందిన అమ్మాయి దిశ సంఘటనకు పౌర సమాజం మొత్తం వ్యతిరేకించి గగ్గోలు పెట్టిన భవ్య సంఘటన పౌర సమాజానికి అవసరం లేదా అని ప్రశ్నించారు. పౌర సమాజం కుల వివక్షను తుంగలోతొక్కి సమన్యాయనికి సహకరించండి దిశ, భవ్య, ఇతరులు అందరూ మనుషులు మాత్రమే అని, కులం అంటగట్టి ప్రతిస్పందన ఒక నీచమైన చర్య మాత్రమే అని ఆవేదన చెందారు పెనుమూరు పోలీసులు వెంటనే హంతకులను అరెస్టు చేయని పక్షంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చలో పెనుమూరు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలమహనాడు జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, మండల కార్యవర్గ సభ్యులు చిరంజీవి పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

- ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం

సర్టిఫికెట్లు అందిస్తున్న డాక్టర్ ఫైరోజా బేగం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భవ: కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. ఆసుపత్రిలో 164మందికి వివిద రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. పంచాయతీ కార్మికులు 22 మందికి కుక్క కరిచినా ఏమి కాకుండా ఉండేందుకు ముందస్తుగా ఏవిఆర్ వ్యాక్సిన్ వేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్ ఆధ్వర్యంలో మండలంలోని టి.సాకిరేవుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించి, 215 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసి, 22మందికి ఆరోగ్యశ్రీ పథకం కింద సిఫార్సు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శివరామక్రిష్ణ, డాక్టర్లు సోని, హర్షితరెడ్డి, శ్రీలక్ష్మి, భారతి, అమరావతి, శ్రీవిద్య, మహమ్మద్ నయీమ్, అబ్దుల్ కలాం ఆజాద్, విజయలక్ష్మి, సర్పంచ్ వెంకటరమణారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ కేశవరెడ్డి, వైద్య సిబ్బంది సుధాకర, బాబాసాబ్, భాస్కర, మౌనిక పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

కళ్లకలకతో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-పీలేరు

సీజనల్ అంటు వ్యాధిగా విస్తరిస్తున్న కళ్లకలక నివారణా చర్యలు ప్రతి విద్యార్థి విధిగా పాటించాలని కంటి వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కళ్లకలక వ్యాధి- నివారణ చర్యలు అనే అంశంపై చికిత్స, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది సీజనల్ గా వచ్చే కంటి సమస్య అని, ఆందోళన పడాల్సిన పనిలేదని, తగు జాగ్రత్తలు తీసుకుంటే దాన్ని నివారించవచ్చని చెప్పారు. ఎవరికైన కళ్ళు ఎర్రగా కనబడితే వారి నుంచి దూరంగా ఉండాలని, అలాంటి వారు ఒక గదిలో ఉండి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. సాధ్యమైనంతవరకు వ్యాధి సోకిన వారికి కాస్త దూరంగా ఉండడం శ్రేయస్కరమని, చేతులు శుభ్రంగా ఉంచు కోవాలని, ఒకవేళ కళ్లు ఎర్రగా మారితే వాటిని చేత్తో నులమడం, ప్రయాణాలకు, ఫోన్లు, టివిలకు దూరంగా ఉండాలని సూచించారు. చేతి రుమాలు, తవల్స్, తదితర వస్తువులు పరస్పరం మార్చవద్దని, డాక్టరును కలసి మందులు, కళ్ళకు చుక్కల తీసుకుని గంట గంటకూ వేసుకోవాలని కంటి వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసులు, తలపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి సంయుక్తంగా విద్యార్థులకు ఆరోగ్య విద్య అందించి, చికిత్సలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌రెడ్డి, పర్యవేక్షకులు కుసుమ, ఎఎన్‌ఎం భార్గవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

5 లోపు దరఖాస్తులు సమర్పించాలి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు సంబంధిత పూర్తి వివరాలతో అక్టోబర్ 5 లోపు తమ దరఖాస్తులను కార్యాలయంలో సమర్పించాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి టి.భరత్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని కళాకారులకు కొత్తగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకు సంబంధించి కళాకారుల వివరాలను, జాబితాలను నిర్దేశిత ప్రొఫార్మాలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యాలయానికి పంపాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. జిల్లాలోని అర్హత కలిగి ఉండి గుర్తింపు కార్డులు లేని కళాకారులందరూ 'జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, సమాచార పౌర సంబంధాల శాఖ, కలెక్టరేట్ వెనుక వైపు భవనం, రాయచోటి అనే చిరునామాలో అందజేయాలని తెలిపారు. అర్హత కలిగిన కళాకారులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలోని పేర్కొన్నారు.

'స్పందన' తాత్కాలికంగా రద్దు

ప్రజాశక్తి - రాయచోటి

సోమవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

మోత మోగిద్దాం పేరుతో నిరసన

ప్రజాశక్తి - రాయచోటి

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ నిరసన కార్యక్రమానికి నారా బ్రాహ్మణి పిలుపు మేరకు శని వారం రాత్రి 7.05 గంటలకు మోత మోగించాలనే కార్యక్రమాన్ని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు ఆధ్వ ర్యంలో టిడిపి కార్యాల యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి విజిల్స్ వేస్తూ, హార్న్ కొడుతూ, గిన్నెలు కొడుతూ గాలివీడు రోడ్డులో నిరసన తెలియ జేశారు. ప్రసాద్ బాబు పిలుపు మేరకు మాసాపేట, మునె ప్పగారిపల్లెలో మోత మోగిద్దాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మయాన ఇర్శాద్‌ఖాన్, ఖాదర్హుస్సేన్, ఖలీల్, బాషా, నవాజ్, ఫరూక్, షకీల్, వాజిద్, అఫ్రోజ్, సయ్యద్, అన్వర్, జవీద్, మస్తాన్, ఫిరోజ్ సాదిక్, ముత్తు కూరు రఫీ, జమాల్, ఖాదర్‌బాషా, సైపుల్లా, కరామత్, షబ్బీర్, శ్రీనివా సులు, లాయర్ సతీష్ రెడ్డి, మంత్రి రెడ్డయ్య, శివ, సహదేవా, బడిశెట్టి రవి, సాయిరాంరాజు, స్టూడియో ప్రసాద్, త్యాగరాజు, పిన్నంఅశోక్, బోనంశెట్టి తిమ్మయ్య, నాగ, వాకావాసు, చెన్నకృష్ణనాయుడు, రెడ్డి, కోటి, శివ, శీన, మన్నేరు రామాంజనేయులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా నారా బ్రాహ్మణి ఇచ్చిన పిలుపుమేరకు ప్యాలెస్ పిల్లి సిఎం జగన్ చెవులకు వినిపించేలా టిడిపి శ్రేణులు, జనసైనికులు, వీర మహిళలు నివాసాలు, కార్యాలయాల వద్ద నుంచే తనదైన శైలిలో 5 నిమిషాల పాటు మోత మోగించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రంలో రావణ కాష్టంగా మారిందని దుయ్యబట్టారు. చంద్రబాబును కక్షపూరితంగా అరెస్టు చేశారని, దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించి బాసటగా నిలవాలని తెలిపారు. ఆంగ్ల పత్రిక హాన్స్ ఇండియాలో కూడా కొద్ది రోజుల్లో నారా కుటుంబ సభ్యులైన నారా లోకేష్, భువనేశ్వరి, బ్రాహ్మణీలను, నందమూరి బాలకృష్ణను సైతం అరెస్టు చేస్తారని వార్త ప్రచురితమైందని తెలిపారు. ఈ విషయంపై తాను ఆ పత్రిక ఎడిటర్‌తో మాట్లాడానని, వారికి ఆ సమాచారం ఏ విధంగా అందిందని అడిగి తెలుసుకున్నానని తెలిపారు. స్పందించిన పత్రిక ఎడిటర్ మాకు పార్టీ ఉన్నత నాయకుల నుంచి సమాచారం అందిందని సమాధానం చెప్పారని తెలిపారు. కక్షపూరితంగా రాజకీయాల్లో అక్రమ అరెస్టులు చేస్తున్న జగన్‌ను ఇంటికి సాగనంపేందుకు వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని వర్గాల వారు నడుం బిగించాలని తెలిపారు. ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల ఆగ్రహం ఎలా ఉంటుందో ప్రజలకు భయపడి ప్యాలెస్‌లో దాక్కుని ఉన్న జగన్ గూబ గుయ్యుమనేలా తాడేపల్లి ప్యాలెస్ వరకు వినపడేలా ఈ మోతను మోగించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. త్వరలోనే తమ నాయకుడు జైలు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని, తమకు

రాయచోటి : డప్పులు మోగిస్తున్న టిడిపి నాయకులు

న్యాయస్థానాల మీద అపార నమ్మకం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట, వీరబల్లి, రాజంపేట, టి.సుండుపల్లి మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** మహాత్మా గాంధీ చెప్పిన మూడు సూత్రాలను ప్రజలకు గుర్తు చేస్తూ వినూత్నంగా టిడిపి బాబుతో మేము సైతం రిలే నిరాహారదీక్ష కొనసాగించింది. పట్టణం లోని స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద మాజీ శాసనసభ్యులు దొమ్మలపాటి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాబు గారికి తోడుగా నియంతపై పోరాటానికి మేము సైతం రిలే నిరాహారదీక్ష కార్యక్రమానికి మదనపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు పచ్చిపాల రామకృష్ణ ఆధ్వర్యంలో మద్దతు తెలుపుతూ మహాత్మా గాంధీ చెప్పిన చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు అంటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్ పచ్చిపాల తులసి, మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మి, రాధ, ఉషారాణి, ఎస్.ఎం.రఫీ, చాణుక్య తేజ, భవానీ ప్రసాద్, యర్రబల్లి వెంకటరమణా రెడ్డి, బొమ్మిశెట్టి పురుషోత్తం, రామిశెట్టి నీలకంఠ, ప్రభాకర్, కత్తి లక్ష్మన్న, పసుపులేటి శ్రీనివాసులు, కాశీ శ్రీరామ్ వాల్మీకి, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. **పీలేరు:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా పీలేరులో టిడిపి శ్రేణులు మోత మోగిద్దాం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. శనివారం రాత్రి ప్యాలెస్లోని సైకో జగన్ కి వినిపించేలా స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు 7 గంటల నుండి 7.05 వరకు 5 నిమిషాల పాటు ఈలలతో గోల చేశారు. సెల్ టార్చ్ వేస్తూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో భారీ స్థాయిలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసనల జోరు!

ప్రజా'దృష్టి'

జిపిఎస్ అమలు వద్దు సిపిఎస్ అమలు కావాలనే నినాదంతో ఉపా ధ్యాయుల నిరసనల సునామీని తలపించింది. రెండ్రోజుల కిందట కడప, అన్న మయ్య జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసనల దీక్షలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇతర ఉపాధ్యాయ సంఘాలు నిరసనల్ని మరో మెట్టుకు తీసుకెళ్లడం అభినందనీయం. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారం సంద ర్భంగా ప్రతిపక్ష నేత హోదాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ మిన్నంటోంది. దేశంలో చత్తీష్‌గడ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో సిపిఎస్‌ను అమలు చేసిన సంగతి తెలి సిందే. సదరు రాష్ట్రాల్లో అమలు చేయగా లేనిది, ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు సాధ్యం కాదో చెప్పాలని నిలదీయాల్సిన అవసరం ఉంది. 2024 సార్వత్రిక ఎన్ని కల్లో సిపిఎస్ అంశం అజెండాగా మార్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయ సంఘ నాయకులదేనని చెప్పవచ్చు. రెండేళ్ల కిందట చలో విజయవాడ కార్యక్రమానికి వచ్చిన స్పందనతో ప్రభుత్వం ఉలిక్కిపడిన సంగతి తెలిసిందే. గత అనుభవాల నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల దగ్గర నుంచి ప్రతిపక్ష పార్టీల అనుబంధ సంఘాలు తలపెట్టిన ఉద్యమాన్ని పోలీసులతో నిర్వీర్యం చేసే ప్రయత్నాన్ని కొన సాగిస్తుండడం సిగ్గుచేటు. ప్రజాస్వామ్యానికి నిరసనలు, ధర్నాలే ప్రాణవా యువులు. ఇటువంటి ప్రజాస్వామ్యం ఊపిరి చిదిమివేసింది. ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్ష స్థానంలో ఉన్నప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయడం దగ్గర నుంచి వివిధ అంశాలపై శాసనసభ, ప్రజా క్షేత్రంలో తీవ్రస్థాయిలో విభేదించిన సంగతి తెలిసిందే. ఇటువంటి అనుభవాలను కలిగిన నాయకుని హోదాలో ఉంటూ ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీల అనుబంధ, ప్రజా సంఘాల శాంతి యుత నిరసనలు, ధర్నాలు, బంద్‌లు నిర్వహించకుండా అడ్డుకోవడం చెట్టు కింద కూర్చుని ఆ చెట్టు కొమ్మను నరుక్కోవడమే అవుతుందని తెలుసుకోవాలి. గత ప్రభుత్వం చేయలేని సిపిఎస్ హామీని ప్రతిపక్ష నాయకుని హోదాలో తాము అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో చేస్తామని నమ్మబలికి, హామీని అమలు చేయాలని అడిగితే నిర్బంధాల్ని ప్రయోగించడం ఇచ్చిన హామీని గాలికి వదిలేయడమే అవుతుంది. యుటిఎఫ్ దగ్గరి నుంచి అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా సిపిఎస్‌ను అమలు చేయాలని నినదించడం ఆహ్వానించదగిన పరిణామం. ఇదే తరహా ఐకమత్యంతో ఉద్యమాన్ని కొనసాగిస్తే సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికార, ప్రతిపక్షంలోని రాజకీయ పార్టీలకు అజెండా నిర్దేశించే అవకాశం ఉంది. ఫలితంగా కార్మికులు తమ హక్కులను సాధించుకునే అవకాశం ఉంటుంది. ఇంతటి సుదీర్ఘ పోరాటం ఇతర ప్రజాస్వామ్య శక్తులకు ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నాడు-నేడు పనులపై మాట్లాడుతున్న ఎంఇఒలు

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గాలివీడు

ఫేస్ టు కింద అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఇఒలు పిల్లి నాగరాజు, వేల్పుల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఎంఆర్సిలో ప్రధానోపా ధ్యాయులు ఎఫ్ఎల్ టీచర్లు అంగన్వాడీ టీచర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నిధులు జమ అయిన పరిధిలో అంగన్వాడీ కేంద్రాలలో పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫేస్-2 కింద రూ.14కోట్ల మండలానికి మంజూరు అయ్యిందని, నిధులు ఉన్నవారు సకాలంలో పూర్తి చేయాలని ఎర్కొన్నారు. డిఇఒ వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా వివరాలను వివరించినట్లు తెలిపారు.

అడవిని తలపిస్తున్న శ్మశాన వాటిక

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని ఫక్కిరారెడ్డిపల్లిలో ఉన్న శ్మశాన వాటిక అడవి తలపిస్తోంది. శ్మశానం ఏపుగా దట్టంగా చెట్లు పెరిగిపోవడంతో శ్మశానంలో ఉన్న సమాధులు కూడా కనిపించడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఎవరైనా మరణిస్తే భూస్థాపితం చేయాలంటే జెసిబి వాహనాన్ని ఉపయోగించుకునే పరిస్థితి ఎర్పడిందన్నారు. చుట్టూ ప్రహరీ కూడా లేదని, నీటి సౌకర్యం కోసం బోరు గా, చేతి పంపు గానీ త్రాగునీటి వసతి లేదన్నారు. గ్రామ సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి మాట్లాడుతూ ఫక్కిరారెడ్డిగారిపల్లి శ్మశాన వాటికకు అసౌకరంగా ఉన్న విషయం వాస్తవమేనన్నారు. నూతన శ్మశాన నిర్మాణం కోసం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ద్వారా స్థలాన్ని కూడా ఏర్పాటు చేయడానికి ప్రతిపాదన పంపామని పేర్కొన్నారు.

హుండీ ఆదాయం రూ.54 వేలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లి మండలం, తవళం గ్రామంలో వెలసిన శ్రీ నేలమల్లేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం శనివారం ఉదయం ఆలయ ఇఒ మంజుల, మదనపల్లి గ్రూప్ దేవాలయాల ఇఒ రమణ, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి పర్యవేక్షణలో ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మంజుల మాట్లాడుతూ ఆలయ హుండీని లెక్కించినట్లు తెలిపారు. మూడు నెలలకు హుండీ ద్వారా రూ.54,486లు ఆదాయం ఆలయానికి వచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని దేవాలయానికి సంబంధించిన ఇండియన్ బ్యాంక్ అకౌంట్ వాల్మీకిపురం నందు జమచేసి, ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఆలయ తాత్కాలిక కార్యవర్గ సభ్యులు గోపాలకృష్ణ, రవీంద్ర, రవి, శంకర, ఆలయ అర్చకులు నాగస్వామి, దేవాదాయశాఖ అధికారులు అంకయ్య, అటెండర్ మహేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు అక్రమం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడుని అక్రమంగా అరెస్టు చేశారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. బాబుతో తో మేము ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ వైసిపి నాయకులు ఓటమి భయంతో, కక్షతో చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం దారుణమన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపి ప్రభంజనం సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు షఫీవుల్లా, మదార్‌సాబ్, చావడి కిట్టన్న, ప్రభాకర, రవికుమార్, మస్తాన్‌రెడ్డి, చంద్రశేఖర్, గట్టు చంద్రన్న, లతీఫ్, సుబ్బమ్మ, బాబు పాల్గొన్నారు.

వైసిపి మండల కన్వీనర్ల నియామకం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక మండల వైసిపి కన్వీనర్‌గా ప్రదీప్‌రెడ్డి, నగర పంచాయతీ పట్టణం కన్వీనర్‌గా సి.ఆర్.చిన్నికృష్ణని నియమిస్తూ శనివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే గృహసారథులు,సచివాలయ కన్వీనర్లను కలుపుకొని శాసనసభ్యుల నిర్ణయంతో సమన్వయంతో కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. తమను ఈ పదవులకు ఎంపిక చేసిన ఎమ్మెల్యేకు, వైసిపి పలమనేరు నియోజకవర్గం పరిశీలకులు ఖలీల్‌అహ్మద్‌కు ధన్యవాదాలు తెలిపారు. **నందలూరు:** నందలూరు మండలం లేబాక గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు అన్నం నాగేంద్ర మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజంపేట నియోజకవర్గ యూత్ లీడర్ పునగాని గుణయాదవ్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వక్స్ బోర్డ్ కార్యదర్శి సయ్యద్‌అమీర్, ఆర్ముగం విశ్వనాథ్, ఓర్సు శ్రీనివాసులు పాల్గొన్నారు. **ములకలచెరువు :** మలకలచెరువు వైసిపి కన్వీనర్‌గా కోటిరెడ్డి మాధవరెడ్డి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి నాపై నమ్మకంతో రెండోసారి కన్వీనర్‌గా నియమించడం సంతోషకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయం తథ్యమన్నారు. **తంబళ్లపల్లె:** వైసిపి మండల కన్వీనర్‌గా రెండవసారి కన్నె మడుగు పంచాయితీ కె.రామగానిపల్లెకు చెందిన ఆర్.చౌడేశ్వర్‌ను నియమించారు. నియామకానికి కృషిచేసిన రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, కృతజ్ఞతలు తెలిపారు.

స్వస్థలానికి చేరిన మృతదేహం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కుమారునిపల్లె దళితవాడకు చెందిన రాజబోయిన శివకుమార్(52) గుండెపోటుతో కువైట్‌లో మృతి చెందాడు. మృతదేహాన్ని స్వస్థలం చేర్చుటకు రాష్ట్ర పభుత్వ సలహాదారులు, ఎపిఎన్ఆర్‌టిఎస్ చైర్మన్,వైసిపి కన్వీనర్ మేడపాటి వెంకట్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి చేర్చారు. మృతదేహం రావడంతో గ్రామంలో విషాదఛాయలు కలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, భార్య, కూతురు కన్నీటి పర్యంతమయ్యారు. తన భర్త మృతదేహాన్ని తమకు చేర్చుటకు అహర్నిశలు కృషి చేసిన ఎపి ఎన్ఆర్‌టిఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, బాలిరెడ్డి, కో-ఆర్డినేటర్ నాయిని మహేశ్వర్ రెడ్డి, కువైట్ వైసిపి ప్రధాన కోశాధికారి యం.వి.నరసారెడ్డి, వైసిపి సేవాదళ్ సభ్యుడు గోవిందురాజు, పుల్లంపేట మండల జెఎసి. కో-ఆర్డినేటర్ నాగిరెడ్డి, హరినాధరెడ్డి, అందరికీ తమ కుటుంబం ఎల్లవేళలా రుణపడి ఉంటామని భార్య రామసుబ్బమ్మ తెలిపారు.

బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మేరీ మట్టి మేరా దేశ్ చిత్రలేఖనం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అద్భుత ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించే ఉద్దేశంతో పాఠశాలలో మేరీ మట్టి మేర దేశ్ కార్యక్రమానికి శ్రీకారం ప్రభుత్వం శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, బాలనరసింహులు, ఆసిఫ్‌బాషా, రమణయ్య, హేమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం

కలికిరి : పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో ఏ ఒక్కరూ వైద్యం కోసం ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి మన రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్షతో ప్రతి పేదవాడికి ఉచిత వైద్యం అందుతుందని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఐదు దశలుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ో గ్రామంలోని విలేజ్ క్లినిక్ లో భాగంగా ఆశా వర్కర్లు, వాలంటీర్లు మమేకమై ప్రతి ఇంటిని జల్లెడపట్టి సర్వే చేసి ప్రతి ఇంట్లో బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తారని వివరించారు .అవసరాన్ని బట్టి యూరిన్ మలేరియా, డెంగ్యూ, కఫం పరీక్షలు కూడా చేస్తారని తెలిపారు. ఇలా ఏడు రకాల పరీక్షలు నిర్వహించి ప్రతి ఇంటికి లో ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై ఒక నివేదిక ఇచ్చి ఆరోగ్య శ్రీ పథకాన్ని ఎలా వినియోగించుకోవాలో, ఆరోగ్యశ్రీ యాప్ డౌన్లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తారన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి మందులు ఇవ్వడమే కాకుండా మ్యాపింగ్ చేసి పుడ్డు సప్లిమెంటేషన్ కోసం వాలంటీర్లు చర్యలు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట వార్డు కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది, వాలంటీర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. **నందలూరు :** శనివారం పాటూరు పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష వైద్య సేవలను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో పాటూరు సర్పంచ్ అక్కిరెడ్డి స్వరూప, మండల పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, జిల్లా వక్స్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, వైద్యాధికారులు సృజన, చంద్రశేఖర్ రెడ్డి, అనురాధ, వైసిపి నాయకులు గడికోట సుబ్బారెడ్డి, అక్కిరెడ్డి మోహన్‌రెడ్డి, తోట శ్రీనివాసులు, పల్లంరాజా, మారెం బాలసుబ్రమణ్యం, ఓర్సు శ్రీనివాసులు, పెనుబాల నాగసుబ్బయ్య, ఆర్ముగం విశ్వనాథ్, బూసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కాకి చంద్ర, విజయుడు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ప్రతి ఇంటికి వైద్యసేవలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపె ట్టిందని నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్, పురుషోత్తం, డాక్టర్ శంకర్, రజిని, రాధిక, విమల దేవకృప, మొజుద్దీన్, తహాశీల్దార్ రఫీఅహ్మద్, డిటి అన్సర్, నగర పంచాయతీ మేనేజర్ రమాదేవి, నగర పంచాయతీ ఆర్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు దేవుడిచ్చిన వరం లాంటిదని ఎంపిడిఒ శేషగిరిరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎంపిపి నరసింహులు, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డిలతో కలిసి వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని డిఎల్‌డిఒ లక్ష్మీపతి, మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ దీక్షితారాణి, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ అర్షియాఅంజుమ్, డాక్టర్ సనా, అంగన్వాడీ సూపర్వైజర్ భాను లక్ష్మీదేవి, ఎంఎల్‌హెచ్‌పిలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు.మండలంలోని కొమ్మనవారిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి 62 లక్షల కుటుంబాలు ఆరోగ్యవంతంగా ఉండాలన్న ధ్యేయంతో 45 రోజుల పాటు 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, తలవాయిపల్లి మాజీసర్పంచ్ మల్లికార్జునరెడ్డి, సొసైటీ చైర్మన్ రంగారెడ్డి, సర్పంచ్ వడ్డి రాములమ్మ, చెంగయ్య, ఎంపిటిసి చెంగయ్య, రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ శేఖర్, వాలంటీర్లు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, సిహెచ్ ఓలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **పెనగలూరు :** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని చక్రంపేట మండల ప్రాథమిక పాఠశాలలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్నారు. గతంలో వైఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చి ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి కొండూరు సౌందర్య, జడ్పిటిసి సుబ్బరాయుడు, ఎంపిడిఒ వరప్రసాద్, ధనుంజయరెడ్డి, డిటి మురళి, గుడ్ల వీరనారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** మండలం అనంతరాజుపేట-1 గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన "జగనన్న ఆరోగ్య సురక్ష"వైద్య శిబిరంలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజరెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, జడ్‌పిటిసి రత్నమ్మ, ఉపసర్పంచ్ తోట శివ సాయి, ఎంపిటిసిలు పి.జనార్ధనరాజు, బి.మల్లికార్జున, జిల్లా పౌరసరఫరాశాఖ అధికారి రఘురాం, స్థానిక సీనియర్ నాయకులు సలాం, వేణుగోపాల్‌రెడ్డి, రామచంద్రయ్య, షఫీ, మణి, అంజి, తహశీల్దార్ రామమోహన్, డిటి అమరేశ్వరి, వాలంటీర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **కలకడ:** ప్రతి ఇంటికి వైద్య సేవలు అందించడమే రాష్ట్రప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ బాటవారిపల్లి సచివాలయం పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, తహసిల్దార్ ప్రదీప్, సింగిల్ విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, పార్టీ కన్వీనర్ కమలాకర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ కిషోర్ కుమార్ రెడ్డి, మల్లికార్జున రావు, జవహర్‌బాబు, మోహన్, మండల సచివాలయ కన్వీనర్ మోహన్ రాజా,సెక్రటరీ షబానాభాను, శివాజీ, పవన్‌కుమార్, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సూపర్వైజర్, అంగన్వాడీ టీచర్స్, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు. **తంబళ్లపల్లె :** గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. శనివారం బాల్‌రెడ్డిగారిపల్లి పంచాయితీ బలకవారిపల్లి ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని స్పెషల్ ఆఫీసర్ స్కందప్ప, సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అనుపమ, డాక్టర్లు మునికుమార్, ప్రత్యేక వైద్య నిపుణులు లుమీతిగ్లా, కిరణ్‌లు ప్రజలకు కొన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. **మదనపల్లె అర్బన్:** జగనన్న ఆరోగ్య సురక్ష,ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షబానా , జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లాలు పేర్కొన్నారు. శనివారం మదనపల్లె మునిసిపాలిటీ 14వ వార్డులో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో సచివాలయం ఏఎన్ఎంలు,వార్డు సచివాలయం కన్వినర్లు,గృహ సారధులు, వాలంటీర్లు స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు. **కలికిరి:** వైద్య, విద్య, ఆర్థిక పురోగతే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. శనివారం కలికిరి మేజర్ పంచాయతీ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీ మిధున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి లాంచనంగా ప్రారంభించి ప్రభుత్వం చేపట్టిన వైద్యరంగంలో పలు పథకాలులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. పత్తేగడ గ్రామపంచాయతీ నందు ఎంపీ మిధున్ రెడ్డి సొంత నిధులతో భూమిని సేకరించి వాటిలో దాదాపు 300 ఇళ్ళ కుటుంబాలకు సరిపడా జగనన్న కాలనీ ఏర్పాటుచేసి ఇల్లు పట్టాలు పంపిణీ చేసి పట్టాలతో పాటు ప్రతి మహిళకు చీరను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జగనన్న కాలనీ ఏర్పాటు చేయడం ఆడపడుచులకు చీరను పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని అభివృద్ధిని చూసి జగనన్న ను మరోసారి సీఎం చేయాలని కోరారు. పార్టీ చూడకుండా కులం చూడకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి జగనన్న కాలనీలో గృహము ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే తమ దృష్టికి తెస్తే వారికి కూడా ఇళ్లను కేటాయిస్తామని తెలిపారు. రైతులకు మోటర్లను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎపి మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, మాజీ మర్కెఫెడ్ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, నియోజకవర్గ పరిశీలకు సహదేవరెడ్డి, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్పిటిసి పద్మజ లోకవర్ధన్, మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, ఎంపిడిఒ గంగయ్యా యాదవ్, తహశీల్దార్ భాగ్యలత, కొటాల వైసీపీ నాయకుల వెంకటపతి, ముస్లిం మైనార్టీ యువ నాయకులు వేంపల్లి బావాజీ, వేంపల్లి ఫయాజ్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి వి. హరి, రెడ్డప్ప, వెంకట్‌రెడ్డి, గంగయ్య, ఎంపిటిసి బోగేష్, వార్డ్‌మెంబర్ ఖాదర్‌బాషా, విశ్వనాథ, అజయ్ పాల్గొన్నారు.

పెనగలూరు : మహిళకు ఆరోగ్య సురక్ష పత్రాలను అందిస్తున్న కొరముట్ల

నారా బ్రాహ్మణిని కలిసిన మహిళా నాయకులు

రాజంపేట అర్బన్ : రాజంపేట టిడిపి మహిళా నాయకులు బాలరాజు, సుభద్ర, పూజారి గిరిజలు శనివారం రాజమండ్రిలోని లోకేష్ టెంట్ హౌస్ లో ఉన్న నారా బ్రాహ్మణిని కలిసి చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మచ్చలేని నాయకుడిపై జగన్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి చెరసాలలో పెట్టారని, ఇది చాలా దుర్మార్గమైన చర్యని అన్నారు. చంద్రబాబు న్యాయస్థానాలలో సచ్ఛీలుడిగా రుజువు చేసుకొని త్వరలోనే బయటకు వస్తారని అన్నారు.

'ఏఖ్ తరీఖ్-ఏఖ్ గంట'ను జయప్రదం చేయండి

బి.కొత్తకోట : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘ కార్యాలయాలలో ఏఖ్ తరీఖ్-ఏఖ్ గంట కార్యక్రమాన్ని రెండు రోజులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు నగర పంచాయతీ కమిషనర్ పి.ఎస్.మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం పురపాలక సంఘ పరిధిలో స్వచ్ఛందంగా శ్రమదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 9 గంటలకు నగర పంచాయతీ, దిగువ బస్టాండ్ నుండి ర్యాలీగా అందరు బయలుదేరి పెద్దచెరువు కట్ట నందు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. వాలంటీర్లు, వార్డు సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆదేశించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదాన ప్రాముఖ్యతను గురించి వివరించారు. కార్యక్రమంలో కడప రిమ్స్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి డాక్టర్ ప్రవీణ్, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఎల్.రాజమోహన్‌రెడ్డి, కె.వెంకట నరసయ్య, కళాశాల సిబ్బంది, స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఐసిటిసి కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, వారి సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎఎస్ఐ మృతి

పీలేరు: అనారోగ్యంతో ఎఎస్ఐ మృతి చెందిన సంఘటన కర్నూలులో చోటు చేసుకుంది. పీలేరు మండలంలోని పచ్చార్లమాకులపల్లి తాండాకు చెందిన ఎం.రమేష్ నాయక్ కర్నూలు ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆదివారం స్వగ్రామం పచ్చార్లమాకులపల్లి తాండాలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

కాంగ్రెస్ ఒబిసి ఉపాధ్యక్షులుగా పాలగిరి హబీబ్

రాయచోటి : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా పాలగిరి హబీబ్‌ను నియమించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తనకు పదవీ రావడానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, రాయలసీమ జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, మూలవెంకట్రావు, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు మహబూబ్‌బాషా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ అల్లాబకాష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన పదవీని బాధ్యతగా నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి ఆహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు రాయచోటి చెన్నక్రిష్ణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా చైర్మన్ నరేష్, డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి ఖదీర్, మోరంరెడ్డి మైసూరారెడ్డి, తిరుపతి వెంకటేష్, ముబారక్, రమణయ్య, నూరుల్లా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

4న టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం : మాజీ ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్: టిడిపి, జనసేన పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జరగవలసిన ఆత్మీయ సమావేశం పార్టీ శ్రేణుల సూచనలతో బుధవారానికి వాయిదా వేశామని మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి అయన మాట్లాడుతూ ఈ ఆత్మీయ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి పెద్దఎత్తున నాయకులు, కార్యకార్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలు, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తలపెట్టిన కార్యక్రమానికి అందరూ హాజరై పార్టీని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. పార్టీ శ్రేణులు నిర్ణయమే రాష్ట్ర శ్రేయసుకు శిరోధార్యమన్నారు. సమావేశంలో నాయకులు బాలుస్వామి, మాజీ టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యా సాగర్, మాజీ మార్కెట్ డైరెక్టర్ నవీన్ చౌదరి, మాజీ బిల్డింగ్ సోసైటీ అధ్యక్షులు హరిహర రెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మదనపల్లె అర్బన్: విద్యార్థులు ఇష్టపడి చదవాలని మోటివేటర్ రామమూర్తి అన్నారు. శనివారం మిట్స్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆసక్తితో చదవాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలపై ఉన్న మమకారంతో పాటు వారిని సరైన బాటలో నడిచేలా చూసుకోవాలని పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు బానిసై ఎంతో మంది వారి జీవితాలను నాశనం చేసుకుంటునారు. ప్రతి ఒక్కరికీ తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలనే తపన ఉంటుంది, కానీ వారిలో కొంత మంది మాత్రమే తాము అనుకున్న లక్ష్యం వైపు నిష్టగా పయనించి చివరకు విజయం సాధిస్తారు. కొందరైతే దీనికి కారణం లక్ష్య సాధనలో ఎదురయ్యే అవరోధాలకు భయపడి కనీసం చేయాల్సిన పనచికూడా చేయరు. లక్ష్యం గురించి ఆలోచించేవారు అవరోధాల దాటుకుంటూ, లక్ష్య సాధనకు అనువైన మార్గం గురించి శోధించాలి అని, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విజయం వైపు సాగాలన్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైన లొంగిపోకూడదు, కుంగిపోకూడదని, ఆత్మవిశ్వాసంతో అవరోధాలపై ఆధిపత్యం సాధించగలిగితే విజయం తథ్యమని పేర్కొన్నారు.విద్యార్థులు కళాశాలకు క్రమంగా హాజరు అవుతున్నారా, పరీక్షలో వారి పనితీరు ఎలావుందీ అనే విషయాన్నీ కనీసం నెలకు ఒకసారైనా కళాశాలకు వచ్చి తెలుసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు సదుపాయాలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతి డాక్టర్ గంగాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ముక్తియార్ అలీఖాన్

అంగన్వాడీ స్థల సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-గుర్రంకొండ

అంగన్వాడీ కేంద్రం స్థలం సమస్యను పరిష్కరించాలని మండల కన్వీనర్ ముక్తియార్ అలీఖాన్‌తో పాటు గ్రామ స్తులు శనివారం తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత తహశీల్దార్ సర్వేనెంబర్ 277లో ఐదు సెంట్ల స్థలాన్ని అంగన్వాడీ కేంద్రానికి కేటాయించారని తెలిపారు. అప్పట్లో నిర్మాణ పనులు ప్రారంభించారని అయితే గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ యూసుఫ్ భార్య ప్రస్తుత టీచర్ ఫర్వీన్ జాగా తమదంటూ నిర్మాణపు పనులను అడ్డు కొనడంతో నిర్మాణం నిలిచిపోయాయని అన్నారు. త స్థలానికి ఆమెకు ఎటువంటి సంబంధం లేదని సాక్షాదారాలు తహశీల్దార్‌కు ఇచ్చామని తెలిపారు. తమ పిల్లలు సరైన వసతులు లేని అంగన్వాడీ కేంద్రంలో ఉంటున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైన తహశీల్దార్ తగు చర్యలు తీసుకొని తమ పిల్లలకు నాణ్యమైన వసతులు కల్పించాలని కోరారు.

వారాహి యాత్ర విజయవంతం కావాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ చేపట్టనున్న నాలుగవ విడత వారాహి యాత్ర విజయవంతం కావాలని మాజీ డిఆర్‌డిఎ రాష్ట్ర అధికారి యల్లటూరు శ్రీనివాసరాజు ఆకాంక్షించారు. ఆయన సోదరుడు శివరామరాజు ఆధ్వర్యంలో శనివారం పట్టణ శివారులోని ఆలయం వద్ద పూజకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే పవన్ కల్యాణ్ వారాహి యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పివిఆర్ కుమార్, చిట్టే భాస్కర్, పత్తి నారాయణ, మౌల, రాజ ఆచారి, నాసర్ ఖాన్, సాయిరాజు, మురళీధర్‌రాజు, కట్టారుబాబు, చింతల శివ, నాని, కిరణ్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలికిరిలో కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా ప్రవేశం పొందిన అనంతరం మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేయుటకుగాను సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. పదవ తరగతితో ఉత్తీర్ణత సాధించి పాలిటెక్నిక్ లో చేరదలుచుకున్న విధ్యార్థులు అక్టోబర్ 2న సాయంత్రం 5గంటల లోపు కార్యాలయం నందు దరఖాస్తు చేసుకుని, 3న ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరు కావాలని తెలిపారు. వివరములకు 9505504200 నంబరును సంప్రదించాలన్నారు.

నేడు స్వచ్ఛత హీ సేవ

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని 17 గ్రామాలలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత కోసం ఆదివారం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. దేవాలయాల్లో శ్రమదానం, చెరువులు, కుంటల్లో పనులు పరిశుభ్రతపై చర్చించనున్నట్లు తెలిపారు. అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్‌గా రెడ్డిశేఖర్

గాలివీడు : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా రెడ్డిశేఖర్ నియమతులైనట్లు తహశీల్దార్ దైవాదీనం పేర్కొన్నారు. గ్రూప్-4కు చెందిన వ్యక్తి మొదటి అపాయింట్మెంట్ తహశీల్దార్ కార్యాలయంలో విధుల్లోకి చేరినట్లు పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు సిబ్బంది అవసరం ఉందని తెలిపారు.

మెడికల్ ఆఫీసర్‌గా వెంకట్రామయ్య

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ వెంకట్రామయ్య

స్థానిక వైద్య విధానపరిషత్ ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ వెంకటరామయ్య శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసి షబానా ఉద్యోగానికి రాజీనామా ఇవ్వడంతో ఈ పోస్ట్ కాళీ ఏర్ప డింది. కలెక్టర్ గిరీష, ఉమ్మడి చిత్తూరుజిల్లా డిసిహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డిలు మెడికల్ ఆఫీసర్ బాధ్యతలను డాక్టర్ వెంకటరామయ్యకు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు సకాలంలో నిర్వహించాల్సిన వైద్య సేవలు అందిస్తూ ఆస్పత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఎంపీ సమక్షంలో వైసిపిలో చేరిన హనీఫ్

ప్రజాశక్తి-కలికిరి

ముస్లిం మైనార్టీ జెఎసి అధ్యక్షుడు హనీఫ్ ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రరెడ్డి సమక్షంలో శనివారం వైసిపిలో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ కలికిరిలో ముస్లిం జెఎసి ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానన్నారు. కరోనా సమయంలో ఎంతో మంది కరోనా వ్యాధితో పోరాడుతూ మృతి చెందిన మృతదేహాలకు కుల మతాలకతీతంగా వారి సాంప్రదాయం ప్రకారం ఘనంగా అంత్యక్రియలు నిర్వహించి అన్నీ పార్టీల నుంచి మన్ననలు అందుకున్నానన్నారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరి పార్టీ అభివృద్ధికి కృషి చేశానన్నారు. పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో పలువురు జెఎసి సభ్యులతో వైసిపిలో చేరినట్లు తెలిపారు. జెఎసి సభ్యులు ఖాదర్ వల్లి, జాకీర్, యాసీన్, ముబారక్, సయ్యద్, ఎల్లప్ప, సిరాజ్, ఫయాజ్, జావీద్, షమన్‌షా, సుబహన్, షఫీ, అసిఫ్, తాజు, రఫీ, ఆరిఫ్, సోము, మహమ్మద్, జాఫర్, నూరుల్లా, రమణ, సుల్తాన్, బావాజీ, ఇర్ఫాన్, సాదిక్, అర్బాజ్ తో పాటు మరో వంద మంది వైసిపి పార్టీలో చేరారు. కార్యక్రమంలో నల్లారి తిమ్మారెడ్డి, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి, పలువురు వైసిపి నాయకులు, పాల్గొన్నారు.



హనీఫ్‌ను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

క్రైం కార్నర్

దేవాలయంలో నగదు అపహరణ

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని గోరాన్‌చెరువు పంచాయతీ అవులసేట్టివారిపల్లి వద్ద ఉన్న చౌడేశ్వరి ఆలయంలో హుండీని పగలగొట్టి అందులో ఉన్న రూ.8వేలు నగదును అపహరించుకపోయారు. పూజారి ఆవులశెట్టి రామచంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రెడ్డయ్య పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట, కుమ్మరపల్లి ,పెద్దచెరువు వద్ద ఇలా దొంగతనాలు దేవాలయంలో హుండీ పగులగొట్టారని స్థానికులు చెప్పారు. చోరీకి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.